

రారండోయ్.. మా కళాశాలకు

మా కళాశాలలో చేరండి.. మీకు మంచి భవిష్యత్ ఉంటుందని సర్కార్ కళాశాల అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



ఏడుపాయల హుండీ లెక్కింపు

ఏడుపాయల వనదుర్గామాత హుండీ ఆదాయం రూ. 47,50,681 వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ తెలిపారు.

వివరాలు 8లో ▸



కొట్టకురా.. చెట్టునురా..!

నీడనిచ్చే వృక్షాలను అక్రమార్కులు అడ్డగోలుగా నరికివేస్తున్నారు. అధికారులు సైతం వీరికి వత్తాసు పలుకుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

'ధరణి' సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. . జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం ఎగుమతి, దిగుమతితో పాటు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం వివరాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ఆన్‌లైన్ లాగిన్ పాస్‌వర్డ్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలు అందించిన పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. జటిలమైన సమస్యలపై అవసరం అయితే క్షేత్రస్థాయిలో పర్యటన చేసి నివృత్తి చేయాలని ఆదేశించారు. జూన్ 7వ తేదీ వరకు ప్రజావాణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు.

దళారులను ఆశ్రయించొద్దు

పెద్దశంకరంపేట(మెదక్): జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రవీందర్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పేటలోని కొనుగోలు కేంద్రంలో జొన్నలు క్వింటాల్‌కు రూ.3,180 చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని చెప్పారు.

జీలుగ కోసం రైతుల బారులు



లారీ నుంచి నేరుగా రైతులకు అందిస్తున్న జీలుగ విత్తనాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో జీలుగ కోసం రైతులు ఎగబడ్డారు. సోమవారం లారీ లోడ్ వచ్చిందనే సమాచారంతో రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గంటలోనే బస్తాలు అమ్ముడు పోవడంతో ఆలస్యంగా వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు. రైతుల డిమాండ్‌కు అనుకూలంగా జీలుగ అందుబాటులో ఉంచాలని రైతులు కోరారు. వర్షాలు పడడంతో దుక్కి దున్ని జీలుగ విత్తేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి రైతుల డిమాండ్‌కు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

గోడు ఎవరికి చెప్పకోవాలి?



కలెక్టరేట్‌లో వృద్ధురాలు

మెదక్ కలెక్టరేట్: ఏళ్ల తరబడి ప్రజావాణిలో దరఖాస్తులు ఇస్తున్నా.. భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామస్తురాలు రాణమ్మ వాపోయింది. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమెకు ప్రజావాణి రద్దు విషయం తెలిసింది. దీంతో కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తానని అక్కడే కూర్చుంది. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సోదరుడికి భూమి సాగు చేసుకోమని ఇస్తే ఆక్రమించుకున్నాడని వాపోయింది. పోలీస్‌స్టేషన్లు, కోర్టు, కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. కొంతమేర భూమి ఇచ్చినప్పటికీ దానిని సర్వే చేయాలని గత కలెక్టర్లు, ఆర్డీఓలు ఆదేశాలు జారీ చేసిన అధికారులు ఇప్పటివరకు తనకు న్యాయం చేయలేదని వాపోయింది.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: బెస్ట్ అవైలబుల్ పథకం కోసం జిల్లాలోని అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 25 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. 3వ తరగతిలో 13 సీట్లు, 5వ తరగతిలో 6, 8వ తరగతిలో 6 ఖాళీగా ఉన్నాయన్నారు. బాలికలకు మొదటి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఇదో రకం దోపిడీ!

ఖాళీ సంచులకూ కాసులే..

- అడ్వాన్సుల పేరుతో గన్నీ బ్యాగుకు రూ.పది చొప్పున వసూలు
- వంద బస్తాలు తీసుకెళ్తే రూ.వెయ్యి
- ధాన్యం నింపుకొచ్చినా అడ్వాన్సు తిరిగివ్వని నిర్వాహకులు
- కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారాజ్యం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలను అడుగడుగునా దోపిడీ చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు రైతుల వద్ద ట్రిప్పునకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా గన్నీ బ్యాగుల అడ్వాన్సుల పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో గన్నీ బ్యాగుకు రూ.10 చొప్పున తీసుకున్న అడ్వాన్సును రైతులకు తిరిగి చెల్లించడం లేదు. ఇదేమని అడిగితే నాణ్యత, తేమ శాతం సాకుగా చూపి ధాన్యం దించుకునేందుకు కొర్రీ పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. అసలే అకాల వర్షాలు.. మరోవైపు నత్తనడకన సాగుతున్న తూకాలు.. ఇలా అనేక ఇబ్బందులు పడుతున్న రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

ఉచితంగా ఇవ్వాలి..

నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు గన్నీబ్యాగులు ఉచితంగా ఇవ్వాలి. ఈ బ్యాగుల్లో ధాన్యాన్ని నింపుకుని కేంద్రాలకు తీసుకువస్తారు. కానీ అడ్వాన్సు పేరుతో తీసుకున్న డబ్బును అందిన కాడికి దండుకుంటున్నారు. రెండు ఎకరాలున్న చిన్న, సన్నకారు రైతు 40 క్వింటాళ్ల ధాన్యాన్ని తెచ్చేందుకు 100 బస్తాలు అవసరం ఉంటుంది. ఈ వంద బస్తాలు ఇవ్వాలంటే రూ.వెయ్యి అడ్వాన్సు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అడ్వాన్సులు అడిగితే ధాన్యం దించుకోవడంలో కిరికిరి, నాణ్యత పేరుతో ఇబ్బందులు పెడతారనే భయంతో రైతులు ఇచ్చిన అడ్వాన్సు అడగడం లేదు. దీంతో నిర్వాహకులు ఈ మొత్తాన్ని జేబులో వేసుకుంటున్నారు. ఈ వ్యవహారాన్ని విలేకరులకు చెప్పేందుకు కూడా రైతులు నిరాకరిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న కేంద్రాల్లో ఈ పరిస్థితి లేదు. ప్రధానంగా రాజకీయ నేతల కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

చాలా కేంద్రాల్లో ఇదే తంతు..

- సంగారెడ్డి జిల్లాలో మొత్తం 211 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతోంది. ఇప్పటి వరకు 14,524 మంది రైతుల వద్ద 74,894 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ సీజనులో ధాన్యం సేకరణకు మొత్తం 49.05 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అవసరం మేరకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.
- మెదక్ జిల్లాలో 410 కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతోంది. మొత్తం 47,254 మంది రైతుల వద్ద 2.05 లక్షల మెట్రిక్ టన్నుల ధ్యాన్యాన్ని సేకరించారు. ఇప్పటి వరకు 54.80 లక్షల గన్నీ బ్యాగులను వినియోగించారు. మరో 38.64 లక్షల గన్నీ బ్యాగులు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.
- సిద్దిపేట జిల్లాలో 403 కేంద్రాల్లో ధాన్యం కొంటున్నారు. ఇప్పటి వరకు 48,294 మంది రైతుల వద్ద 2.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు సుమారు 52 లక్షల గన్నీ బ్యాగులను వినియోగించగా, మరో ఎనిమిది లక్షల బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మా దృష్టికి రాలేదు..

గన్నీ బ్యాగుల కోసం రైతుల వద్ద అడ్వాన్సులు తీసుకుంటున్నట్లు మా దృష్టికి రాలేదు. మేము తరచూ కొనుగోలు కేంద్రాలను విజిట్ చేస్తున్నాం. సోమవారం కూడా అందోల్ ప్రాంతంలో కేంద్రాలను సందర్శించాం. అడ్వాన్సులు తీసుకుంటున్నట్లు రైతులు ఎక్కడా మాకు ఫిర్యాదు చేయడం లేదు. గన్నీ బ్యాగుల కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.

–శ్రీధర్, ఇన్‌చార్జి సహకార శాఖాధికారి, సంగారెడ్డి జిల్లా

రైతులు ఇబ్బంది పడొద్దు

జిల్లా ప్రత్యేకాధికారిణి భారతి హొలికేరి



మాట్లాడుతున్న భారతి హొలికేరి, పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారిణి భారతి హొలికేరి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలను కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించి పరిష్కరించాలని ఆదేశించారు. మిల్లర్ల వద్ద ధాన్యం పేరుకుపోతే సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు తరలించాలన్నారు. రైతులు అధైర్యపడొద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. సీఎంఆర్‌ను త్వరతగతిన సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్స్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఎగుమతి చేసిన ధాన్యాన్ని పెండింగ్ లేకుండా సీఎంఆర్‌కు దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చి కాంటా పెట్టిన ధాన్యంతో పాటు నిల్వ ఉన్న ధాన్యం వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రమాదేవి, శ్రీనివాస్, జయచంద్రారెడ్డి, డీఏఓ గోవింద్, డీసీఓ కరుణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలే మిన్న

- నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన
- జిల్లాలో మొత్తం 60 ఇంటర్ కళాశాలలు
- ఈనెలాఖరు వరకు ఫస్ట్ ఫేజ్ అడ్మిషన్లు
- 'సాక్షి'తో డీఐఈఓ సత్యనారాయణ



మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకుతో మెరుగైన బోధన లభిస్తుందని ఇంటర్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో అన్నిరకాల కోర్సులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు నచ్చిన కోర్సుల్లో అడ్మిషన్లు పొందాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించి ఆర్థికంగా అవస్థల పాలు కావొద్దన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఈనెల 9వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. 2023– 24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 9,553 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరంతా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందనున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 ప్రైవేట్ కళాశాలలు, 7 మోడల్, 6 కేజీబీవీ, 2 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్, 6 ట్రైబల్, 2 మైనార్టీ, 6 మహాత్మ జ్యోతిబాపూలే, 4 సోషల్ వెల్ఫేర్ కలిపి మొత్తం 60 కళాశాలలు ఉన్నాయని తెలిపారు. వీటితో ఈనెల 31వ తేదీ వరకు మొదటి విడత దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

అడ్మిషన్ ప్రక్రియ ఇలా..

జూన్ 1 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టీసీ, స్టడీ సర్టిఫికెట్, తాత్కాలిక ఎస్‌ఎస్‌సీ మెమో ఆధారంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అవకాశం ఉంటుందన్నారు. ఒరిజినల్ ఎస్‌ఎస్‌సీ మెమో అందజేసిన తర్వాతనే అడ్మిషన్ నిర్ధారిస్తామన్నారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీకు 10 శాతం, బీసీలకు 29 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా అర్హతలున్న వారికి 5 శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్, డిఫెన్స్ పర్సనల్ వారికి 3, ఆర్థికంగా వెనుకబడిన వారికి 10, బాలికలకు 33.3 శాతం సీట్ల కేటాయింపు చేస్తామన్నారు. అయితే పదో తరగతిలో పొందిన గ్రేడింగ్ ఆధారంగా అడ్మిషన్లలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని సూచించారు.

ప్రతిభకు పురస్కారం

'పది'లో 9.5 జీపీఏ సాధించిన వారికి సన్మానం ◆ జిల్లావ్యాప్తంగా 398 విద్యార్థుల ఎంపిక

కలెక్టర్ వినూత్న ప్రయోగం ◆ 23న మెదక్‌లో కార్యక్రమం



పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ వినూత్న ప్రయోగానికి రూపకల్పన చేశారు. (2023– 24) బ్యాచ్ పదో తరగతి పరీక్షలో 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఈనెల 23న సన్మానపత్రాలు అందజేయనున్నారు. ఇందుకు జిల్లావ్యాప్తంగా 398 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించామని డీఈఓ తెలిపారు.

92.90 శాతం ఉత్తీర్ణత

జిల్లాలో 146 ఉన్నత పాఠశాలలు, 15 కేజీబీవీలు, 7 మోడల్ స్కూల్స్, 23 గురుకులాలు ఉన్నాయి. 10,283 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 9,553 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో 4,608 మంది బాలురు, 4,945 బాలికలు ఉన్నారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో 92.90 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 18వ స్థానంలో నిలిచింది. కాగా ప్రభుత్వ బడుల నుంచి తక్కువ మంది 10 జీపీఏ సాధించారు. ఈ క్రమంలో వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ, స్ఫూర్తిని రగిలించే ఉద్దేశంతో కలెక్టర్ 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులందరినీ ఈనెల 23వ తేదీన మెదక్‌లోని వైస్రాయి గార్డెన్‌లో సన్మానించనున్నారు.

గురుకులాలు.. ఆదర్శ బడుల హవా

9.5 జీపీఏ సాధించిన 398 మంది విద్యార్థుల్లో గురుకులాలు, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. మండలాల వారీగా చూస్తే అత్యధికంగా మెదక్ మండలంలో 78 మంది, చేగుంట మండలంలో 65, హవేళిఘనపూర్ మండలంలో 48, తూప్రాన్‌లో 47 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అత్యల్పంగా నిజాంపేట, నార్సింగి మండలాల నుంచి ఒక్కో విద్యార్థి ఎంపికయ్యారు. 9.5 జీపీఏ సాధించి ఎంపిక లిస్టులో పేరు లేకుంటే తమ దృష్టికి తీసుకురావాలని డీఈఓ సూచించారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



నిరుపేదలైన గ్రామీణ విద్యార్థులు ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. నేను 9.8 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచా. నిజానికి ప్రభుత్వ బడులు పరిపూర్ణ వికాస కేంద్రాలు. ఎలాంటి ఒత్తిడి లేకుండా, ఆట పాటలతో చదువు కొనసాగిస్తాం. సర్కార్ బడిలో చదివిన చాలా మంది సివిల్ సర్వీసెస్, ఐఆర్ఎస్ లాంటి ఉద్యోగాలు సాధించారు. సర్కార్ బడుల విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

– వరలక్ష్మి, పాపన్నపేట మండల టాపర్

పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో 15 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని.. ప్రతి పాఠశాల 25 మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని కోరారు. ఈ నిబంధన విద్యాహక్కు చట్టంలో ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

నాలుగు తరాల ముచ్చట



కొంశేట్‌పల్లి కుటుంబ సభ్యులు

ఒక కుటుంబానికి చెందిన నాలుగు తరాలు ఒకేవేదికపై కలుసుకున్నాయి. కొంశేట్‌పల్లి కుటుంబ పెద్దలు శ్రీనివాస్, రమేష్, శంకర్, హరికాంత్, తుల్జారాం, చంద్రశేఖర్, నర్సింహులు, హనుమంత్, విష్ణు ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని వెంకటాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సుమారు 300 మంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

– సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

'రైతుల గోస పట్టని సర్కార్'

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతుల పాలిట శాపంగా మారుతోందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మారెడ్డిపల్లిలోని కొనుగోలు కేంద్రంలో పేరుకు పోయిన ధాన్యం కుప్పలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆరుగాలం పాటు కష్టించి పండించిన ధా న్యం అమ్ముకోవడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో, మిల్లుల్లో అన్‌లోడింగ్ చేయడంలో నత్తనడకన సాగుతోందన్నారు.

బడులకు నిధులు

- మరమ్మతులకు రూ.5.15 కోట్ల విడుదల
- ముమ్మరంగా సాగుతున్న పనులు



చేగుంట: చెట్లతిమ్మాయిపల్లి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతులు

మెదక్‌జోన్: ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 562 పాఠశాలల్లో మైనర్ రిపేర్ల కోసం రూ.20.62 కోట్లు అవసరం కాగా ముందస్తుగా 25 శాతం నిధులు విడుదల చేసింది. దీంతో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 899 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లావ్యాప్తంగా 899 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గత ప్రభుత్వ హయాంలో 313 పాఠశాలలను మన ఊరు– మన బడికింద ఎంపిక చేసి వాటికి కొన్ని నిధులు విడుదల చేశారు. పనులు కొంత మేర జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాక పోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. అలాగే జిల్లాలో 24 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో వాటిని మూసి వేశారు. ఇక మిగిలిన 562 పాఠశాలల్లో మైనర్ మరమ్మతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, వీఓతో పాటు ప్రతి పాఠశాలకు ముగ్గురు చొప్పున విద్యార్థుల తల్లులు కమిటీ సభ్యులుగా ఎన్నుకొని అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో 562 పాఠశాలల్లో తాగునీరు, సంపుల నిర్మాణాలు, నల్లాల ఏర్పాట్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు, కరెంట్ తో పాటు చిన్నపాటి మరమ్మతులను చేయిస్తున్నారు. ఇందుకోసం రూ. 20.62 కోట్లు అవసరం కాగా ముందస్తుగా రూ.5.15 కోట్లు విడుదల చేశారు.

జూన్ మొదటి వారంలో పూర్తి

వచ్చేనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానునందున అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మొదలు పెట్టిన మరమ్మతులు జూన్ 5వ తేదీ వరకు పూర్తి కావాలని చెప్పాం. ఇందుకోసం ముందస్తుగా 25 శాతం నిధులు విడుదల చేశాం. అన్ని పాఠశాలల్లో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నారు.

– రాధాకిషన్ డీఈఓ మెదక్

క్లుప్తంగా

కరాటే మెగా టోర్నీ విజేత ప్రణవి



గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అందుకుంటున్న ప్రణవి

మద్దూరు(హుస్నాబాద్): కరాటే మెగా చాంపియన్ షిప్ టోర్నీలో బట్టర ప్రణవి చాంప్‌గా నిలిచింది. గోవాలో జరిగిన యూనివర్సల్ 369 షోటోకాన్, కరాటే అసోషియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టోర్నీ జరిగింది. ఇందులో మద్దూరు మండలం రేబర్తికి చెందిన బాలిక.. ఫైరింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్, కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. రెండు పతకాలను సాధించిన ప్రణవిని సినీనటుడు సుమన్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు ప్రత్యేకంగా అభినందించారు. బాలిక ఏడేళ్లుగా కరాటేలో శిక్షణ తీసుకొని బ్లాక్‌బెల్ట్‌ను సాధించింది. చదువుతో పాటు కరాటేలో రాణిస్తుండటం పట్ల ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



బులియా పింకీ

కొండపాక(గజ్వేల్): వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన కుకునూరుపల్లి మండలంలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్.. ధార్ జిల్లా భాగ్ గ్రామానికి చెందిన దంపతులు బులియా సలాం, భార్య బులియా పింకీ. వీరు మేదినీపూర్ శివారులో గల కామాక్షి ఇటుకల తయారీ కంపెనీలో ఆరు నెలలుగా కూలీ పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈనెల 15న ఇటుకల కంపెనీలో పనులు ముగించుకొని ఇద్దరూ ఆరోజు రాత్రి నిద్రించారు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచే సరికి భార్య కనిపించడం లేదు. బంధువుల, తెలిసిన వారిని భర్త సంప్రదించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో పింకీ అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరికైనా కనిపిస్తే 87126-67345 నంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రాజశేఖర్‌రెడ్డికి సన్మానం



రాజశేఖర్‌రెడ్డికి మెడల్ అందజేస్తున్న ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి ఉత్తమ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రామాయంపేట లయన్స్ క్లబ్‌లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు కొత్త సభ్యులను చేర్పించారు. అందుకు గాను ఆదివారం రాత్రి కరీంనగర్‌లో జరిగిన క్లబ్ సమావేశంలో లయన్ రాష్ట్ర ప్రతినిధి సునిల్‌కుమార్, కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు.. ఆయనకు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.




వికసించిన 'మే' పుష్పాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వికసించిన మే పుష్పాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఐజీ కాలనీలో నివాసం ఉండే వెంకట్వేశ్వర్‌రావు నివాసంలో మే పూవులు వికసించాయి. ప్రతి ఏటా మే నెలలో మాత్రమే ఈ పూవులు రావడం విశేషం.

రారండోయ్..

మా కళాశాలకు..



మీ భవితకు మాది గ్యారంటీ

మా కళాశాలలో చేరండి.. మీకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన బోధన ప్రమాణాలున్నాయి. అపార అనుభవం గల అధ్యాపకులు అంతా కలిసి.. మిమ్మల్ని ది బెస్ట్‌గా తీర్చిదిద్దుతారు. ఇక సౌకర్యాలు అంటారా? ఎలాగో అన్ని మౌలిక వసతులున్నాయి. దీని గురించి ఆలోచించే పనే లేదు. పైగా మా వద్ద చదివిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంక్‌లు కొట్టారు. మీ భవిష్యత్‌కు మాది గ్యారంటీ. అని సర్కార్‌కళాశాల అధ్యాపకులు ఇంటర్ అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను కోరుతున్నారు.



- ఇంటర్ అడ్మిషన్ల కోసం ప్రభుత్వ అధ్యాపకులు క్యాంపెయిన్
- కార్పొరేట్‌కు దీటైన బోధనంటూ ప్రచారం
- కళాశాల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- రెసిడెన్షియల్, గిరిజన, మైనార్టీ కళాశాలల ఏర్పాటు ప్రభావం!

హుస్నాబాద్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపక బృందం సభ్యులు అడ్మిషన్ల కోసం గ్రామగ్రామాన క్యాంపెయిగ్ నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు కళాశాలలో సీటు దొరకాలంటే పెద్ద ప్రయాసే ఉండేది. కళాశాలలో సీటు కోసం పైరవీలు ఉండేవి. పైరవీలు ఉన్న కావాల్సిన గ్రూప్ దొరికేది కాదు. ఓ వైపు ప్రైవేట్ కళాశాలలు ఉన్నప్పటికీ సర్కార్ కళాశాలల్లో చదివే విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలు అన్ని మూతపడినా విద్యార్థుల కోసం వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి కారణం ప్రభుత్వం కులాల వారీగా రెసిడెన్షియల్ కళాశాలలు, గిరిజన, మైనార్టీ కళాశాలలు నెలకొల్పడం. మరో వైపు మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యాబోధన ప్రవేశపెట్టగా సర్కార్ కళాశాలలకు విద్యార్థుల అడ్మిషన్లు తగ్గుతూ వస్తున్నాయి. ఆర్థికంగా ఉన్న వారు కార్పొరేట్ కళాశాలలకు వెళ్తుడటంతో స్థానిక కళాశాల్లో వారి సంఖ్య గననీయంగా తగ్గుతుంది. దీంతో స్థానిక కళాశాలలకు మనుగడ ఉండాలంటే అడ్మిషన్లు పెంచే బాధ్యతను అధ్యాపకులు తీసుకున్నారు. ప్రస్తుతం



క్యాంపెయిన్ చేస్తున్న కళాశాల అధ్యాపకులు

తమ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని టెన్త్ ఉత్తీర్ణ సాధించిన వారి ఇళ్ల చుట్టూ తిరుగుతూ అధ్యాపకులు పాట్లు పడుతున్నారు.

ప్రత్యేక ప్రచారం

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని ప్రత్యేకతలను చెబుతూ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్యను పెంచేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన చేస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థినులకు ఎంసెట్, నీట్, సీఈసీ, హెచ్‌ఈసీ విద్యార్థినులకు టీటీసీ, లాసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. 2023లో ఎంపీసీ విభాగంలో స్టేట్ 8వ ర్యాంక్ సాధించారు. 2024 విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యా సంవత్సరంలో బైపీసీ విభాగంలో, ఎంపీసీ విభాగంలో మంచి మార్కులను విద్యార్థులు సాధించారు.కాగా,10 రోజుల నుంచి అధ్యాపకులు 10 తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వారి జాబితా తీసుకొని ఊరురా తిరుగుతున్నారు. ఇంటింటికి వెళ్లి కళాశాలలో చేరండంటూ కరపత్రాలు పంపిణీ, డోర్ స్టిక్కర్లు అతికించి అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రొత్సహిస్తున్నారు.

తరలుదాం.. చదువుదాం..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఊరు బాట పట్టారు. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ఆధ్వర్యంలో అధ్యాపకులు అర్జున్, జగదీష్, శ్రీనివాస్, యాదగిరి, స్వర్ణలత, సౌందర్య, యాదగిరి, రాములు తదితరులు మామిడ్గి, ఇబ్రహీంపూర్, చినిగెపల్లి, ముంగి, రుక్మాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, విద్యార్థులను తమ కళాశాలలో చేర్పించాలని కోరారు. అందుకు స్పందించిన తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలను తెలపడంతో పేర్లు నమోదు చేసుకున్నారు.



హద్నూర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

డీజిల్‌కు బదులు పెట్రోల్

- ఓ ఆయిల్ బంక్ వర్కర్ నిర్వాకం
- మొరాయించిన ట్రాక్టర్
- పోలీసులకు యజమాని ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): డీజిల్‌కు బదులుగా పెట్రోల్ పోయగా ట్రాక్టర్ మొరాయించింది. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో చోటుచేసుకుంది. సోమవారం మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పెద్దంకి రాజు ట్రాక్టర్‌లో డీజిల్ పోయించేందుకు గవ్వలపల్లిలో పెట్రోల్ పంప్‌కు వచ్చాడు. రూ.1000 డీజిల్ పోయాల్సిందిగా చెప్పగా.. పంప్ వర్కర్ పెట్రోల్ పోస్తున్నదాన్ని గమనించిన ట్రాక్టర్ యజమాని రాజు.. వర్కర్‌ను హెచ్చరించి ఆపివేయించాడు. అప్పటికే 5 లీటర్ల వరకు పోసేశాడు దీంతో ఇంజిన్ మొరాయించింది. దీనిపై యజమాని వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాడు. దీంతో వారు చేరుకుని పంప్ మేనేజర్‌ను ప్రశ్నించగా, పెట్రోల్ పొరపాటున పోసినట్లు అంగీకరించారు. ట్రాక్టర్ ఇంజిన్‌ను బాగు చేయిస్తామని చెప్పి.. మరో వాహనం సాయంతో మెకానిక్ షెడ్డుకు తరలించారు. కాగా, రెండు రోజుల క్రితం శాలిపేటకు చెందిన వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌లోనూ పెట్రోల్ పోశారన్న విషయం వెలుగుచూసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెట్రోల్ యజమాన్యంపై చర్యలు చేపట్టాలని కోరారు.



గవ్వలపల్లిలోని పెట్రోల్ పంప్‌లో డీజిల్ బదులు పెట్రోల్ పోశారని పోలీస్‌లకు వివరిస్తున్న ట్రాక్టర్ యజమాని రాజు

తీరని శోకం మిగిల్చారు...

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల్లో ఇద్దరు వృద్ధులు, మరో ఇరువురు యువకులు ఉన్నారు. కాగా, రాయపోలు, నిజాంపేట, మనోహరాబాద్‌ల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.



నర్సయ్య మృతదేహం

రాయపోలు(దుబ్బాక): కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోలులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల మేరకు.. మండలకేంద్రానికి చెందిన తుడుం నర్సయ్య (60) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకున్నా తగ్గలేదు. ఆదివారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి అతను భోజనం చేశాడు. సోమవారం ఉదయం నిద్ర లేచేసరికి కన్పించకపోవడంతో కుటుంసభ్యులు వెతికారు. కాగా, తన పొలం వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని చెబుతున్నారు. మృతుడి కొడుకు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



పన్నెల అశోక్ (ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): కుటుంబ కలహాలు, అనారోగ్యం కారణంగా పెట్రోల్ పోసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నిజాంపేట మండలంలో జరిగింది. ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం.. నాగధర్ గ్రామానికి చెందిన పన్నెల అశోక్(25) ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంటలను ఆర్పిన కుటుంబసభ్యులు.. తీవ్రగాయాలైన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి నుంచి వైద్యులు సంగారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ అశోక్ చనిపోయాడు. అతడికి భార్య దుర్గ, కుమారుడు ప్రణీత్ ఉన్నారు. మృతుడి తల్లి వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

క్షణికావేశంలో..



అబ్బదాసరి పోషయ్య (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): నిత్యం మద్యం తాగితే ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబసభ్యులు మందలించారు. క్షణికావేశంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగారెడ్డిపేటకు చెందిన అబ్బదాసరి పోషయ్య(55) ఈ నెల 18న మద్యం తాగి ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో క్షణికావేనికి లోనైన అతడు మరుసటిరోజు ఉదయం ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు తెలపడంతో వారు హుటాహుటిన తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. ఇంకా పరిస్థితి విషమంగానే ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్న గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య రేఖ, కుమారుడు స్వామి, కూతురు ఉన్నారు.

మనస్తాపం చెందిన వ్యక్తి ...



నాగరాజు (ఫైల్)

అనారోగ్యంతో సతమతమవుతున్న యువకుడు తన కుటుంబానికి భారం కావద్దని భావించి, ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పాలాటలో జరిగింది. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు(28) కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడ్డాడు. చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈక్రమంలో కుటుంబానికి ఆర్థికంగా భారమవుతున్నానని మనస్తాపం చెందుతున్నాడు. కాగా, ఆదివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిమితి పెంచారు.. కొనుగోలు ఆపారు

- 8.85 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల వరకు పెంపు
- ఆ వెంటనే ఆగిన జొన్న విక్రయాలు
- చేలల్లోనే కుప్పలు
- అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన



పంట చేలల్లో కుప్పగా పోసిన జొన్నలు

కంగ్టి(నారాయణఖేడ్): జొన్నపంట పండించిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారం రోజుల పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ అధికారులు సవ్యంగా కొనుగోళ్లు నిర్వహించారు. 18 రోజులుగా కొనడం ఆపి వేశారు. ప్రతి ఎకరాకు 8.85 క్వింటాళ్ల కొంటామని ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రతి ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు కొంటామని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారు. అప్పటి నుంచి ఎందుకు కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంగ్టి మండలంలో 6,600 ఎకరాల్లో జొన్న పంటను రైతులు పండించారు. అందులో 10 వేల బస్తాలు కూడా కొన లేదని రైతులు చెబుతున్నారు. అందులోనూ ఈ నెల 3వ తేదీ నుంచి కొనుగోలు నిలిపేశారని అంటున్నారు. దీంతో చేలల్లో జొన్నలు కుప్పలుగా చేసి 15 రోజులు గడుస్తున్నాయి. ఇటు చూస్తే అకాల వానలు కురుస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు తడిచి ఎక్కడ రేటు నష్టపోతామోనని లోలోన మథనపడుతున్నారు. కాగా, మార్క్‌ఫెడ్ డీఎం రంజితారెడ్డికి వివరణ కోరగా.. కొనుగోలు కేంద్రాల్లోని బస్తాలు గోదాంలకు తరలించాల్సి ఉందన్నారు. ఆతర్వాత కొంటామని చెప్పారు. అయితే అప్పటి నుంచి మూడు, నాలుగు లారీలు మాత్రమే గోదాంలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. దీంతో జొన్నల కొంటారా? లేదా అని సందిగ్ధంలో రైతులు ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంట కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసుల దాడులు

పది సిలిండర్లు సీజ్.. నిందితులపై కేసు

సదాశివపేట (సంగారెడ్డి): గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసులు దాడులు చేసి సిలిండర్లను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గురునగర్ కాలనీలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పెద్ద రాయితీ సిలిండర్ల నుంచి అక్రమంగా చిన్న సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేస్తున్నారు. ఆపై అమ్ముతున్నారని సమాచారం అందింది. కాగా సోమవారం ఎస్‌ఐ, వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి పది పెద్ద సిలిండర్లు, చిన్న సిలిండర్లను సీజ్ చేశామని సీఐ తెలిపారు.



గురునగర్ కాలనీలో గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చంపుతామంటూ భార్యాపిల్లల బెదిరింపులు

- ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే ఇదంతా
- ఎస్పీ బాలస్వామికి.. తన గోడు విన్నవించిన బాధితుడు చల్లరాజు



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: నేను అనారోగ్యంతో బాధపడుతున్నా. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం చంపుతామంటూ నా భార్యాపిల్లలు బెదిరిస్తున్నారు. న్యాయం చేయండి అని బాధితుడు చల్లరాజు కోరారు. సోమవారం మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి జిల్లాస్థాయి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా తాను కూడా ఫిర్యాదు చేశాడు. ''నా పేరు చల్లరాజు.. మాది హవేళీఘణాపురం మండలం ఔరంగాబాద్ గ్రామం. నేను అనారోగ్యంతో బాధపడుతున్నాను. నా పేరిట రూ.5లక్షల బీమా ఉంటే దాని కోసం చంపివేస్తామని భార్య, చిన్న కుమారుడు బెదిరిస్తున్నారు అని ఎస్పీకి ఫిర్యాదు చేశారు''. స్పందించిన ఎస్పీ తగిన న్యాయం చేయమని హవేళీఘణాపురం ఎస్‌ఐ సూచించారు. అలాగే శివ్వంపేట మండలం బీమ్లా తండాకు చెందిన కేతావత్ శిరీషా తాను అనారోగ్యంతో పుట్టింటికి వెళ్లగా భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు చేసింది. కాగా సమస్యను పరిష్కరించాలని శివంపేట ఎస్‌ఐకి సూచనలు చేశారు. అయితే.. శివ్వంపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి 2023 జూన్ 5న విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ముప్పిరెడ్డిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన కుటుంబీకులకు రూ.30 లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు.

ఏడుపాయల హుండీ లెక్కింపు

70 రోజుల ఆదాయం రూ.47.50 లక్షలు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గాభవానిదేవి హుండీ ఆదాయం రూ 47,50,681 వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్‌లు సోమవారం తెలిపారు. 70 రోజుల అనంతరం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో గోకుల్‌షెడ్‌లో నిర్వహించారు. దేవాదాయ ధర్మాధాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో చేపట్టారు. మిశ్రమ బంగారు, వెండి కానుకలు కూడా వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాదయ్య, సాయిలు, బాగారెడ్డితోపాటు ఆలయ సిబ్బంది, సూర్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, యాదగిరి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగు.. భూమికి బాగు

- చేనుకు చేవా.. పంటకు బలం
- సబ్సిడీపై విత్తనాల పంపిణీ

జహీరాబాద్ టౌన్: రైతులు రసాయనాలు, ఎరువులు మోతాదుకు మించి వాడరాదు. వాడితే భూమిలోని సారం పూర్తిగా తగ్గిపోతుంది. పైగా.. నేల ఆరోగ్యం దెబ్బతిని పంటల దిగుబడులు తగ్గుతాయి. భూమికి సేంద్రియ ఎరువుల వాడకం తగ్గడానికి కారణం గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద తగ్గడమే. పచ్చిరొట్ట విత్తనాలు భూసారం పెంపునకు వాడాల్సి ఉంది. ప్రభుత్వం కూడా రాయితీపై అందజేస్తున్నట్లు వ్యవసాయ శాఖ జహీరాబాద్ ఏడీ భిక్షపతి తెలిపారు. జీలుగ, జనుము విత్తనాలను తొలకరి వర్షాలు కురియడం ప్రారంభమైన తరువాత విత్తనాలను విత్తుకోవాలన్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తనాలు



జనుము పంట(ఫైల్)

ఉపయోగాలు

పచ్చిరొట్ట నేలలో కలియదున్నిన పంట కుళ్లేటప్పుడు విడుదల చేసే వ్యర్థాల వల్ల నేలలలో మొక్కలకు భాసరం, పొటాష్ అందుతుంది. పైగా గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడుతుంది. సూక్ష్మపోషకాలు మొక్కలకు లభ్యమై అధిక దిగుబడులు వస్తాయి. మొక్కల వేళ్ల కూడా ఆరోగ్యం, పట్టుత్వం పెరుగుతుంది.

ఎరువుల వాడకం..

పచ్చిరొట్ట పైర్లలో 16 రకాలు ఉంటాయి. జీలుగ, అవిశ, జనుము, వెంపల్లి, అలసంద, పిల్లిపెసర, పెసర, మినుము, గోడుచిక్కుడు, అజోల్ల, కానుగ, జిల్లేడు, నేల తంగేడు, కొండ మిరప తదితర రకాలున్నాయి. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా జీలుగ, జనుము విత్తనాలు వేస్తారు. పచ్చిరొట్టను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఈ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే త్వరగా కుళ్లుతుంది. 8 కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క ఏపుగా పెరిగి రొట్ట ఎక్కువగా వస్తుంది.

సబ్సిడీపై విత్తనాలు

వ్యవసాయ శాఖ అధికారులు రాయితీపై జీలుగ, జనుము విత్తనాలను పంపిణీకి శ్రీకారం చుట్టారు. క్వింటాలు బస్తా ధర రూ. 9,050 కాగా సబ్సిడీ రూ. 5,400 పోను రైతులు రూ.3,620 చెల్లించాలి. 40 కిలోల బస్తాకు రూ.1,148లు చెల్లించాలని అధికారులు తెలిపారు. అవసరం ఉన్న రైతులు పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఏఈఓను కలిసి అనుమతి తీసుకోవాలన్నారు. తీసుకున్న రైతులు జహీరాబాద్‌లో విత్తనాలు తీసుకోవాలన్నారు.

జీలుగ సాగు ఇలా

జీలుగ పంటను చౌడు, వరి పండించే భూముల్లో సాగు చేసినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయి. ఎకరానికి 20 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. మొక్కలు పెరిగి పూత దశకు వచ్చే సరికి 6 నుంచి 8 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. వీటిని అదే పొలంలో కలియదున్ని మురగపెట్టినట్లయితే 30 నుంచి 32 కిలోల యూరియా లభిస్తుంది. ఈ పంటను సాగు చేస్తే పొలంలో వేయాల్సిన యూరియా కన్నా 30 నుంచి 32 కిలోలు తక్కువగా వేస్తే సరిపోతుంది. తద్వారా 3.5 శాతం నత్రజని, 0.6 శాతం భాస్వరం, 1.2 శాతం పొటాష్ లభిస్తుంది.

జనుము సాగు విధానం

జనుము సాగు చేసేందుకు ఒక ఎకరానికి 9 నుంచి 14 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. తద్వారా ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. వీటిని పొలంలోనే కలియదున్నితే 24 కేజీల యూరియా లభిస్తుంది. ఇందులోనూ 2.3 శాతం నత్రజని, 0.5 శాతం భాస్వరం, 1.8 శాతం పొటాష్ ఉంటుంది.